1St Year Happy Work Anniversary.

RNI : APTEL / 2023 / 89152

# షణ్ముఖ వెలుగు
SHANMUKHAVELUGU

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

THE POWER OF PEN

సంపుటి : 2 సంచిక : 355 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 26 డిసెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 355 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 26 December 2025 PAGES : 8 PRICE : 3/-


## క్రీడల్లో బంధుప్రీతి ఆనాడే అంతమైంది ప్రధాని మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,డిసెంబర్ 25)

క్రీడాకారుల ఎంపికలో బంధుప్రీతి 2014లోనే అంతమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇప్పుడు కష్టపడేతత్వం, నైపుణ్యం ఉన్న పేద పిల్లలు కూడా ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని తెలిపారు. యువతలో క్రీడా సంస్కృతి, నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించే లక్ష్యంతో దిల్లీలో నిర్వహించిన 'సంసద్ ఖేల్ మహోత్సవ్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా వేలాది ప్రతిభావంతులైన క్రీడాకారులను దేశం గుర్తిస్తోందని చెప్పారు.

"2014కు ముందు క్రీడాకారుల ఎంపికలో అవినీతి, అక్రమాలు ఉండేవి. ఈ విధానానికి ముగింపు పలికి దశాబ్దమైంది. మేం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు పూర్తిగా మెరుగయ్యాయి. ప్రస్తుతం పేద కుటుంబాల పిల్లలు కూడా ప్రతిభ, కష్టపడే తత్వంతో క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారు" అని మోదీ తెలిపారు. 2014కు ముందు క్రీడల కోసం దేశ బడ్జెట్లో రూ.1200 కోట్లు కేటాయిస్తే.. ఆ తర్వాతి కాలంలో రూ.3వేల కోట్లు కంటే ఎక్కువ కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక పథకాల ద్వారా అర్హులైన అథ్లెట్లకు నెలకు రూ.25 వేల నుంచి రూ.50వేల వరకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు చెప్పారు.

"దేశంలో ఉన్న ప్రతి అథ్లెట్కు ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. మీరు కేవలం మీ విజయం కోసం మాత్రమే ఆడటం లేదు. దేశం కోసం ఆడుతున్నారు. -మిగతా 2లో

## 'కట్నంగా పాకిస్థాన్ కావాలి'.. మహిళ ప్రపోజల్కు వాజ్పేయీ రిప్లయ్



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,డిసెంబర్ 25)

దిల్లీ: కవితలతో ఎదుటివారిని మంత్రముగ్ధుల్ని చేయడం.. ప్రత్యర్థులపై పదునైన మాటల తూటాలు విసరడం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయీకే సొంతం. అందుకే ఆయనను 'వాచస్పతి' అని కొనియాడుతారు. అలాంటి నేతకు ఓసారి పాకిస్థాన్ మహిళ నుంచి ఊహించని ప్రతిపాదన ఎదురైంది. దానికి ఆయన చెప్పిన సమాధానం ఆమె నోరు మూయించింది. నేడు వాజ్పేయీ 101వ జయంతి సందర్భంగా -మిగతా 2లో

## అమరావతిలో మరో కీలక ఘట్టం.. హైకోర్టు భవన నిర్మాణ పనులు ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 25)

అమరావతి: రాజధాని అమరావతిలో హైకోర్టు నూతన భవనాల్ని 2027కల్లా పూర్తి చేస్తామని పురపాలకశాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. హైకోర్టు నిర్మాణ పనులను రాఫ్ట్ ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి పూజలు చేసి ఆయన ప్రారంభించారు. -మిగతా 2లో

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేత వాజ్పేయీ

## సీఎం చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 25)



అమరావతి: ఆర్థిక సంస్కరణల తర్వాత దేశ ప్రగతికి మాజీ ప్రధాని వాజ్పేయీ తీవ్రంగా కృషిచేశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆయన చూపిన మార్గం సుపరిపాలన అని కొనియాడారు. వాజ్పేయి జయంతి సందర్భంగా అమరావతిలోని వెంకటపాలెంలో ఆయన విగ్రహాన్ని కేంద్రమంత్రి శివరాజ్సింగ్ చౌహాన్తో కలిసి చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సుపరిపాలన సభలో సీఎం మాట్లాడారు. "దేశం మెచ్చే నాయకుడిగా చిరస్థాయిగా ప్రజల గుండెల్లో వాజ్పేయీ నిలిచిపోయారు. చరిత్రను తిరగరాసిన నాయకత్వం ఆయనది. నాకు ఎప్పుడూ స్ఫూర్తినిచ్చే నేత ఎన్టీఆర్. ఎన్టీఆర్, వాజ్పేయీ మధ్య మంచి సాన్నిహిత్యం ఉండేది. నేషనల్ ఫ్రంట్ ద్వారా యాంటీ కాంగ్రెస్కు ఎన్టీఆర్ బీజం వేశారు. ఒకప్పుడు నేను ఫోన్ విషయం మాట్లాడితే చాలా మంది ఎగతాళి చేసేవారు. నాలెడ్జ్ ఎకానమీకి టెలికాం సెక్టార్ వెన్నెముకలాంటిది. ఆ రంగం అద్భుతాలు సృష్టిస్తూ ముందుకెళ్తోందంటే దానికి కారణం వాజ్పేయీ. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు అణుపరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. ఆనాడు ఎన్టీఆర్, వాజ్పేయీ దేశం కోసం ఆలోచించారు. ఇప్పుడు ప్రధాని నరేంద్రమోదీ అలా చేస్తున్నారు. నేను తెలుగుజాతి కోసం ఆలోచిస్తున్నా"అని చంద్రబాబు అన్నారు.

## 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేయాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 25)

పోలవరం, న్యూస్టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 జూన్ నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జలవనరులశాఖ అధికారులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) యోగేష్ పైఠాణ్కర్ ఆదేశించారు. సీఈవోగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయన తొలిసారిగా అథారిటీ సభ్యులతో కలిసి బుధవారం ప్రాజెక్టును సందర్శించారు. డయాఫ్రం వాల్ నిర్మాణంతోపాటు గ్యాప్-1, 2ల్లో జరుగుతున్న ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులను పరిశీలించారు. జలవిద్యుత్తు కేంద్రాన్ని సందర్శించారు. ఏజెన్సీ ప్రతినిధులు, జలవనరులశాఖ సిబ్బందికి సీఈవో పలు సూచనలు చేశారు. ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన యంత్రాలు, సామగ్రి, కార్మికులను సమకూర్చుకోవాలన్నారు. దేవరగొంది, మామిడిగొంది గ్రామాల మధ్య కొండల్లో చేపట్టిన జంట సొరంగాల పనుల గురించి ఈఎన్సీ కె.నరసింహమూర్తి ఆయనకు వివరించారు. పైఠాణ్కర్ వెంట పీపీఏ కార్యదర్శి ఎం.రఘురాం, సీఈలు ఎం.రమేశ్, సివి సుబ్బయ్య, డైరెక్టర్ కె.శంకర్, ప్రాజెక్టు ఎస్ఈ కె.రామచంద్రరావు, ఈఈలు, మేఘా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులున్నారు.

**పునరావాస కాలనీ సందర్శన**

రాజమహేంద్రవరం నుంచి ఉదయం బయలుదేరిన సీఈవో నేరుగా పోలవరం మండలంలోని కొండ్రుకోట పునరావాసకాలనీకి వెళ్లారు. అక్కడి నిర్వాసితులతో సమావేశమయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, ఎక్స్అఫిషియో జాయింట్ కలెక్టర్ వి.అభిషేక్ ప్రాజెక్టు నిర్వాసితులు, పరిహారం, పునరావాసం వివరాలను ఫొటో ప్రదర్శన ద్వారా వెల్లడించారు.

## బీసీ, ఎస్సీలకు 57 శాతం పార్టీ పదవులు

### తెదేపా లోక్సభ నియోజకవర్గ కమిటీల ప్రకటన

### మహిళలకు 28 శాతం పోస్టు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 25)

లోక్సభ నియోజకవర్గ కమిటీలను తెలుగుదేశం పార్టీ బుధవారం ప్రకటించింది. ఒక్కో లోక్సభ నియోజకవర్గానికి 42 మందితో కమిటీలను ఆ పార్టీ నియమించింది. వెనుకబడిన వర్గాలు, ఎస్సీలకు అగ్ర ప్రాధాన్యమిచ్చింది. మొత్తం పదవుల్లో బీసీలకు 37 శాతం, ఎస్సీలకు 20 శాతం కేటాయించింది. ఆ రెండు వర్గాలకూ కలిపి మొత్తం 57 శాతం పదవులిచ్చింది. కార్యవర్గాల్లో మహిళలకు 28 శాతం పదవులు కేటాయించింది. లోక్సభ నియోజకవర్గాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పేర్లు ఇటీవలే ప్రకటించిన పార్టీ... ఇప్పుడు మిగతా కార్యవర్గాల జాబితాలను విడుదల చేసింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాకుండా, ఇది వరకు కమిటీల్లో 32 మంది సభ్యులు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్యను 40కి పెంచింది. ప్రతి లోక్సభ నియోజకవర్గ కమిటీలోనూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు, ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, కార్యదర్శులను.. తొమ్మిది మంది చొప్పున నియమించింది. వీరితోపాటు ఒక కోశాధికారి, ఒక పార్టీ కార్యాలయ కార్యదర్శి, ఒక మీడియా సమన్వయకర్త, సోషల్ మీడియా సమన్వయకర్త ఉంటారు. -మిగతా 2లో

## పౌరవిమాన సేవల్లోకి మరో 4 సంస్థలు




(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 25)

దేశీయ విమాన ప్రయాణికుల విపణిలో అత్యధిక మార్కెట్వాటా ఉన్న ఇండిగో సేవల్లో ఇటీవల తలెత్తిన సమస్యల కారణంగా, లక్షలమంది ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడిన నేపథ్యంలో.. మరిన్ని విమానయాన సంస్థలను రంగంలోకి దింపడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఉత్తర్ప్రదేశ్కు చెందిన శంఖ్ ఎయిర్, తెలుగు రాష్ట్రాలకు చెందిన ట్రూజెట్ సంస్థలకు షెడ్యూల్డ్ విమానాలు నడపడానికి ఎన్ఓసీ (నిరభ్యంతర పత్రం) జారీచేసిన కేంద్ర పౌరవిమానయానశాఖ, తాజాగా కేరళకు చెందిన అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్ప్రెస్ సంస్థలకూ నిరభ్యంతరపత్రం జారీచేసింది. ఈ విషయాన్ని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. 'భారతీయ విమానయాన రంగం ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న మార్కెట్లలో ఒకటి. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారత ప్రభుత్వం మరిన్ని విమానయాన సంస్థలను ప్రోత్సహించడానికి కృషిచేస్తోంది. -మిగతా 2లో

## డ్రోన్లతో గిరిజన ప్రాంతాలకు ఔషధాల సరఫరా

### రెడ్వింగ్ సంస్థతో వైద్య ఆరోగ్య శాఖ ఒప్పందం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 25)

మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ఆసుపత్రులకు డ్రోన్ల ద్వారా ఔషధాలు, బ్లడ్ యూనిట్లు పంపి.. అక్కడి నుంచి రక్త, మల, మూత్ర నమూనాలు వైద్య పరీక్షల కోసం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు నుంచి జనవరి నెలాఖరుకు ఈ తరహా డ్రోన్ సేవలు అందుబాటులోకి తేనుంది. ఈ మేరకు రెడ్వింగ్ సంస్థతో వైద్య ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. మంగళగిరిలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, రెడ్వింగ్ సంస్థ -మిగతా 2లో

## అధికారం కంటే.. పార్టీ కార్యకర్తగా ఉండటమే ఇష్టం: డీకే శివకుమార్

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,డిసెంబర్ 25)

కర్ణాటక రాజకీయాలు ఇటీవల దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారం, పదవుల కంటే కాంగ్రెస్



పార్టీ కార్యకర్తగా ఉండటమే తనకు ఇష్టమని వ్యాఖ్యానించారు. బుధవారం దిల్లీలోని కర్ణాటక భవన్లో డీకే విలేకరులతో మాట్లాడారు. 1980 నుంచి పార్టీ కోసం అవిశ్రాంతంగా పనిచేశానని, ఇప్పటికీ పార్టీ వర్కర్గా ఉండేందుకే తాను ఇష్టపడతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకత్వ మార్పు గురించి ఇటీవల వెల్లువెత్తిన ఊహాగానాలపై ఆయన మాట్లాడుతూ.. 'మా మధ్య (సీఎం సిద్ధరామయ్యను ఉద్దేశిస్తూ) ఏం జరిగిందో నేను వెల్లడించలేను. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు కలిసి పనిచేశాం. పార్టీ కోసం ప్రతిఒక్క కార్యకర్త -మిగతా 2లో

## 'కట్నంగా పాకిస్థాన్ కావాలి'.. మహిళ ప్రపోజల్కు వాజ్పేయీ రిప్లయ్

ఆనాటి సంఘటనను గుర్తుచేసుకున్నారు కేంద్ర రక్షణమంత్రి రాజ్నాథ్ సింగ్.

వాజ్పేయీ జయంతి సందర్భంగా దిల్లీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాజ్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. "ఓసారి వాజ్పేయీ పాకిస్థాన్ పర్యటనకు వెళ్లినప్పుడు.. ఆయన ప్రసంగాలకు ఓ మహిళ ఆకర్షితురాలైంది. వెంటనే ఆయన వద్దకువచ్చి.. 'నన్ను పెళ్లి చేసుకుంటారా? అందుకు బదులుగా కశ్మీర్ను ఇస్తారా?' అని అడిగింది. దీనికి వాజ్పేయీ స్పందిస్తూ.. 'నిన్ను పెళ్లి చేసుకోవడానికి సిద్ధమే.. కానీ, కట్నం కింద పాకిస్థాన్ కావాలి' అని అడిగారు" అంటూ వాజ్పేయీ వాక్చాతుర్యాన్ని కొనియాడారు.

వాజ్పేయీ చాలా అద్భుతంగా ప్రసంగించేవారని, రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేసేటప్పుడు ఎన్నడూ గీత దాటకుండా వ్యవహరించేవారని రాజ్నాథ్ తెలిపారు. భాజపా విస్తరణను చూసి ఎంతగానో మురిసిపోయిన ఆయన.. 'తన కుటుంబం చాలా పెద్దదవుతోంది' అంటూ ఆనందం వ్యక్తంచేశారని కేంద్ర మంత్రి గుర్తుచేసుకున్నారు.

వాజ్పేయీ గొప్ప రాజనీతిజ్ఞుడే కాదు. అద్భుత కవి. రచయిత కూడా. ఆయన నాలుకపై సరస్వతీ మాత నివాసముంటుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు అంటుండేవారు. పార్లమెంటు లోపలా, వెలుపలా ఆయన చేసిన ప్రసంగాలు ప్రత్యర్థులను సైతం ఆకట్టుకున్నాయి. ఇదిలాఉండగా.. వాజ్పేయీ వివాహం చేసుకోలేదు. గ్వాలియర్లోని విక్టోరియా కళాశాలలో తనతో కలిసి చదువుకున్న రాజ్కుమారి కౌల్ కుమార్తె నమితను ఆయన దత్తత తీసుకున్నారు. మాజీ ప్రధాని అంత్యక్రియలను ఆమే నిర్వహించారు.

## అమరావతిలో మరో కీలక ఘట్టం.. హైకోర్టు భవన నిర్మాణ పనులు ప్రారంభం

రెండంతస్తుల్లో బేస్మెంట్, గ్రౌండ్ ఫ్లోర్తో పాటు మరో 7 అంతస్తుల్లో ఐకానిక్ భవనంగా హైకోర్టు నిర్మించనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. 21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం జరగనుందని.. 52 కోర్టు హాళ్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. మొత్తం 45 టన్నుల స్టీల్ను భవన నిర్మాణానికి వినియోగిస్తున్నట్టు చెప్పారు. హైకోర్టు పనులు ప్రారంభం కావటం రాజధాని నిర్మాణంలో మరో కీలక ఘట్టమని మంత్రి వ్యాఖ్యానించారు.

## బీసీ, ఎస్సీలకు 57 శాతం పార్టీ పదవులు

### బీసీలకు 389 పదవులు

లోక్సభ నియోజకవర్గ కమిటీల నియామకంలో సామాజిక సమతూకం పాటించింది. మొదటి నుంచి పార్టీకి అండదండగా ఉన్న బీసీలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చింది.

### మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలోని 25 లోక్సభ స్థానాలకుగాను వేసిన పార్టీ కమిటీల్లో మొత్తం 1,050 పదవులు ఉండగా వాటిలో అత్యధికంగా 389 పదవులు వారికి కేటాయించింది. ఓసీలకు 335, ఎస్సీలకు 207, ఎస్టీలకు 41, మైనారిటీలకు 78 పదవులను కేటాయించింది. ఈ కమిటీల కూర్పుపై పార్టీ అధినేత చంద్రబాబు విస్తృత కసరత్తు చేశారు. ఒక్కో లోక్సభ నియోజకవర్గానికి ఒక మంత్రి, మరో ఇద్దరు సీనియర్ నాయకులతో త్రిసభ్య కమిటీలను నియమించారు. ఆ కమిటీలు ఆయా లోక్సభ స్థానాల పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించాయి. ఇతర మార్గాల్లో, ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా తెప్పించుకున్న సమాచారాన్ని కూడా బేరీజు వేసుకుని పార్టీ కమిటీలను నియమించారు. ప్రాథమికంగా రూపొందించిన జాబితాల్లో మహిళల సంఖ్య తక్కువగా ఉండటంతో, వారి సంఖ్య పెంచాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆ మేరకు జాబితాల్లో మార్పులు చేయించారు. పార్టీలో యువత, మహిళలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆయన అభిమతానికి అనుగుణంగా కమిటీల కూర్పు జరిగింది. పార్టీకి దీర్ఘకాలంగా విధేయులుగా ఉంటూ, అంకితభావంతో పనిచేస్తున్నవారికి ప్రాధాన్యమిచ్చారు.

## డ్రోన్లతో గిరిజన ప్రాంతాలకు ఔషధాల సరఫరా

ప్రతినిధి కుందన్ మాదిరెడ్డి ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటికే అరుణాచల్ప్రదేశ్లో సేవలందిస్తున్న ఈ సంస్థ.. రాష్ట్రంలో 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్' కింద ప్రాథమికంగా ఆరు నెలల పాటు ఉచిత సేవలు అందించడానికి అంగీకరించింది. పాడేరు కేంద్రంగా 60 నుంచి 80 కి.మీ. పరిధిలోని పీహెచ్సీలు, సీహెచ్సీలకు డ్రోన్ల సేవలు ప్రారంభిస్తారు. భవిష్యత్తులో విశాఖ కేజీహెచ్ నుంచి పాడేరుకు మందుల రవాణాకూ డ్రోన్లు వినియోగించాలని భావిస్తున్నారు. కోల్డ్చైన్ సదుపాయంతో, రెండు కిలోల బరువు మోసే డ్రోన్లను అందుబాటులోకి తెస్తామని వీరపాండియన్ వెల్లడించారు.

## అధికారం కంటే.. పార్టీ కార్యకర్తగా ఉండటమే ఇష్టం: డీకే శివకుమార్

ఎంతో కష్టపడ్డాడు. హైకమాండ్ మాకు స్వేచ్ఛనిచ్చింది. కలిసి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాం. పార్టీ అధికారంలోకి రావడానికి నాతోపాటు సిద్ధరామయ్య, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలు కూడా ఎంతో కృషి చేశారు' అని అన్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి తర్వాత నాయకత్వ మార్పునకు సంబంధించిన చర్చల గురించి విలేకరులు ప్రశ్నించారు. అలాంటి చర్చలు మీడియాలో మాత్రమే జరుగుతున్నాయని.. ప్రభుత్వం, పార్టీలో కాదని డీకే స్పష్టం చేశారు. ఇక, ప్రస్తుతం పార్టీ హైకమాండ్ను కలవడం లేదని, విదేశాల నుంచి వచ్చిన రాహుల్గాంధీని ఇబ్బంది పెట్టాలనుకోవడం లేదని పేర్కొన్నారు. మంత్రివర్గ విస్తరణపై సీఎం మాత్రమే సమాధానం చెప్పగలరని వ్యాఖ్యానించారు.

## పౌరవిమాన సేవల్లోకి మరో 4 సంస్థలు

ఉడాన్ పథకం ద్వారా స్టార్ ఎయిర్, ఇండియా వన్ ఎయిర్, ఫ్లై91 వంటి చిన్నవిమానయాన సంస్థలు దేశంలో ప్రాంతీయ అనుసంధానతను బలపర్చడంలో కీలకభూమిక పోషిస్తున్నాయి. ఈ రంగంలో ఇంకా విస్తృత అభివృద్ధికి అవకాశాలున్నాయి' అని పేర్కొన్నారు.

### భోగాపురం కేంద్రంగా ట్రూజెట్ పనిచేయాలి

ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నం (భోగాపురం)లో కొత్త విమానాశ్రయం ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో.. అక్కడి నుంచి పనిచేయాలని ట్రూజెట్కు సూచించినట్లు మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. గతంలో హైదరాబాద్ కేంద్రంగా ఈ సంస్థ కార్యకలాపాలు సాగించినా, తదుపరి సర్వీసులు నిలిచిపోయాయి. మళ్లీ విశాఖ కేంద్రంగా ప్రారంభం కానుంది. శంఖ్ ఎయిర్ ఉత్తర భారతదేశం కేంద్రంగా, అలింద్, ఫ్లైఎక్స్ప్రెస్లు దక్షిణాది కేంద్రంగా విమానాలు నడిపే అవకాశం ఉన్నట్లు చెప్పారు. 2026 తొలి ఆరునెలల్లో ఈ 4 సంస్థలు తమ సర్వీసులు ప్రారంభించే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు.

రోమ్కు ఎయిరిండియా విమానం: ఐరోపా దేశాలకు విమాన అనుసంధానాన్ని పెంచేందుకు రోమ్ (ఇటలీ)కు విమాన సర్వీసులను పునరుద్ధరిస్తున్నట్లు ఎయిరిండియా తెలిపింది. మార్చి 25 నుంచి వారానికి 4 విమాన సర్వీసులను నడపనుంది.

లండన్కు దిల్లీ నుంచి విమానం: ఇండిగో ముంబయి-లండన్ మధ్య రోజువారీ విమాన సర్వీసులు నిర్వహిస్తున్న ఇండిగో, 2026 ఫిబ్రవరి 2 నుంచి దిల్లీ-లండన్ (హీత్రూ)కు నేరుగా విమానాలు నిర్వహించనుంది. వారంలో 5 సర్వీసులు ఉంటాయి.

టెల్ అవీవ్ నుంచి దిల్లీ, ముంబయికి విమానాలు: ఇజ్రైర్

టెల్ అవీవ్ నుంచి దిల్లీ, ముంబయికి నేరుగా విమాన సర్వీసులు నిర్వహించేందుకు ఇజ్రాయెల్ విమానయాన సంస్థ ఇజ్రైర్ ముందుకొచ్చింది. అన్ని అనుమతులు కనుక లభిస్తే, 2026 ఏప్రిల్ నుంచే తాము సర్వీసులు ప్రారంభిస్తామని బుధవారం వెల్లడించింది.

## క్రీడల్లో బంధుప్రీతి ఆనాడే అంతమైంది ప్రధాని మోదీ

త్రివర్ణ పతాక గౌరవం కోసం ఆడుతున్నారన్న విషయం మర్చిపోవద్దు" అని దిశానిర్దేశం చేశారు. తమ పిల్లలు కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని, క్రీడా రంగంలో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. అది వారిని శారీరకంగా, మానసికంగానూ ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదం చేస్తుందన్నారు. 2030లో కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యమిస్తోందని, 2036లో ఒలింపిక్స్ క్రీడలకు కూడా వేదికగా నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఈ సందర్భంగా ప్రధాని మోదీ తెలిపారు.

# పుల్లలచెరువులో ఘనంగా క్రిస్మస్ వీధి సువార్త అలరించిన సండే స్కూల్ విద్యార్థుల ప్రదర్శనలు







(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, డిసెంబర్ 25)
మండల కేంద్రం పుల్లలచెరువులో క్రిస్మస్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందగా పుల్లలచెరువు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున పట్టణ పురవీధుల్లో వీధి సువార్త కార్యక్రమం చేపట్టారు. యేసుక్రీస్తు జనన సందేశం, ఆయన చూపిన ప్రేమ, త్యాగ గుణాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో సండే స్కూల్ విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. క్రీస్తు జన్మవృత్తాంతాన్ని ప్రతిబింబించే గీతాలకు విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ క్రిస్మస్ సందేశాన్ని వినూత్నంగా ప్రజలకు చేరవేశారు. ఈ సందర్భంగా సంఘ కాపరి ఆర్ ఆనందరావు మాట్లాడుతూ లోక రక్షకుడైన యేసుక్రీస్తు శాంతి, సమాధానం, ప్రేమను అందించేందుకు ఈ భూమిపై జన్మించారని తెలిపారు. ఆయన చూపిన ప్రేమ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, పాప విముక్తి కోసం ఆయన చేసిన త్యాగం సాటిలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాప్టిస్ట్ చర్చి పెద్దలు, సంఘ సభ్యులు, మహిళలు, సండే స్కూల్ పిల్లలు, అధిక సంఖ్యలో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. వీధుల్లో సాగిన ఈ ర్యాలీతో పుల్లలచెరువు మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది.



షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# శ్రీ హరిహర క్షేత్రంలో అంగరంగ వైభోగంగా ధనుర్మాస వ్రత వేడుకలు

**తిరుప్పావడ సేవలో మావులేటి శివ రామ్ దంపతులు**
**విశేష పూజలు నిర్వహించిన**
**మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్ కుమార్**







(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 25)

ధనుర్మాసం సందర్భంగా హరిహర క్షేత్రంలో గురువారం తిరుప్పావడ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. శాశ్వత కైంకర్య పోషకులుగా జ్యోతి గ్రానైట్ సిఓఓ మావులేటి శివరామ్ దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా గోదా సమేత రంగనాథ స్వామి వారికి 51 కేజీలతో పులిహోర, 616 మినప గారెలు, డ్రైఫ్రూట్స్, పుష్పమాలికలతో సాక్షాత్తు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి రూపాన్ని అలంకరణగా తయారు చేసి "శ్రీ హరిహారక్షేత్రం, శ్రీవారి మహామండపం" నందు స్వామి వారి దర్శనం భక్తులను మంత్ర ముగ్దుల్ని చేసింది. స్వామి వారికి శివరామ్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రాతఃకాలంలో స్వామి వారికి తిరుప్పళాండు, తిరుప్పల్లెలుచి, తురుప్పావై పారాయణం, ప్రథమ ఆరాధన, అర్చన, విశ్వక్షేనా ఆరాధన, నైవేద్యం, హారతి, శాత్తుమొరై పదవ పాశురం సమర్పణ భక్తులచే సామూహిక విష్ణు సహస్ర పారాయణం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి లక్ష్మి పద్మావతి, శిద్దా సుధీర్ కుమార్ ఆలయంలో వేంచేసి ఉన్న మూల విరాట్‌లకు విశేష పూజాలు నిర్వహించారు. అనంతరం శ్రీ గోదాదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ అర్చకులు వెంకట హరి కుమారాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉభయ దాతలు మావులేటి శివ రామ్, నీలిమ పద్మిని దంపతులు భక్తులకు అల్పాహారం, తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో శిద్దా కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

---



# నేడు విభిన్న ప్రతిభావంతులకు గిరిజన ప్రజలకు ప్రత్యేక పిజిఆర్ఎస్

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్**

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 25)**

జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు, గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు, గిరిజనుల సమస్యలను పరిష్కరించుటకు ప్రతి నెలా చివరి శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ నందు ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక పిజిఆర్ఎస్‌లో విభిన్న ప్రతిభావంతులు, గిరిజనులు తమ సమస్యల అర్జీలను జిల్లా కలెక్టర్‌కు అందజేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

---





# పిల్లలు బాగా చదువుకుని జీవితంలో పైకి రావాలి

**జిల్లా కలెక్టర్ సతీమణి పి సుజాత**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, డిసెంబర్ 25)**

పిల్లలు బాగా చదువుకుని జీవితంలో పైకి రావాలని జిల్లా కలెక్టర్ సతీమణి పి సుజాత ఆకాంక్షించారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని గురువారం రామ్‌నగర్‌లోని బాలసదన్‌ను జిల్లా కలెక్టర్ సతీమణి పి సుజాత సందర్శించి పిల్లలతో కలిసి క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పిల్లలకు స్వీట్స్‌ను అందచేసారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి సువర్ణ, జిల్లా బాల సంరక్షణ అధికారి దినేష్ కుమార్, బాలసదన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

---

# అక్రమ బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

**అదుపులోకి ఐదుగురు షాపు నిర్వాహకులు**
**పలు మద్యం సీసాలు స్వాధీనం**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, డిసెంబర్ 25)

జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పలు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ బెల్ట్ షాపుల పై టాస్క్ ఫోర్స్ ఉక్కుపాదం మోపింది. ఇందులో భాగంగా ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పడి పలు పోలీస్ స్టేషన్ల పరిధిలోని బెల్ట్ షాపుల పై గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించాయి. టాస్క్ ఫోర్స్ సీఐ యు సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐలు సుదర్శన్, శివరామయ్య, ఏఎస్ఐ మహబూబ్ భాషా, సిబ్బంది, ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల వ్యాప్తంగా విస్తృత దాడులు నిర్వహించారు. మద్దిరాలపాడు గ్రామ హైవే వద్ద బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుండి 6 బీర్ బాటిళ్లు, 5 క్వార్టర్ (180 ఎంఎల్) మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని తాలూకా పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అలాగే చదలవాడ గ్రామంలో (చీరాల రోడ్డు) అక్రమ మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి 10 బీర్ బాటిళ్లు, 6 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. తదుపరి గుండ్లపల్లి హైవే రోడ్డు పై నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తి వద్ద 45 క్వార్టర్ బాటిళ్లు, అలాగే మరొక వ్యక్తి వద్ద 18 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అల్లూరు గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని 31 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని తదుపరి దర్యాప్తు నిమిత్తం కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 94 క్వార్టర్ బాటిళ్లు, 16 బీర్ బాటిళ్లు, 11 బాటిళ్లు (ఒక్కొక్కటి 90 మిల్లీ.లీటర్లు) మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను మరియు (తరువాయి 4లో...)





# ఆర్టికల్ 370 గోడను కూల్చేశాం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 25)

జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 అనే గోడను కూల్చేయడాన్ని భాజపా గర్వకారణంగా భావిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. వారసత్వ రాజకీయాలు చేసే కాంగ్రెస్ పార్టీలో ఒక కుటుంబాన్నే కీర్తించడం దారుణమని వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని వాజ్‌పేయీ 101వ జయంతి సందర్భంగా గురువారం ఆయన ఉత్తర్ ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో 'రాష్ట్రీయ ప్రేరణా స్థల్'ను ప్రారంభించారు. 65 ఎకరాల్లో రూ.230 కోట్లతో నిర్మించిన ఈ జాతీయ స్మారకంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, వాజ్‌పేయీల విగ్రహాలను ఆవిష్కరించారు. కమలం ఆకారంలో నిర్మించిన మ్యూజియాన్ని ప్రారంభించి దానిని తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. 'ఆర్టికల్ 370 అనే గోడను కూల్చే అవకాశం మా ప్రభుత్వానికి రావడాన్ని భాజపా గర్వకారణంగా భావిస్తోంది. రెండు రాజ్యాంగాలను, రెండు జెండాలను, ఇద్దరు ప్రధాన మంత్రులను శ్యామా ప్రసాద్ ముఖర్జీ వ్యతిరేకించారు. అదే స్ఫూర్తితో మేం ఆర్టికల్ 370ని రద్దు చేయడంవల్ల జమ్మూ కశ్మీర్‌లోనూ భారత రాజ్యాంగం అమలవుతోంది' అని ప్రధాని పేర్కొన్నారు. 'భాజపా నేతృత్వంలోని ఎన్డీయే ఆవిష్కరించిన సుపరిపాలన కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో సరికొత్త శిఖరాలను చేరుకుంది' అని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సాధించిన ప్రతి విజయాన్నీ ఒకే కుటుంబానికి ఆపాదిస్తూ వచ్చిన సంస్కృతిని మనం మరిచిపోకూడదని గుర్తు చేశారు. భారత రత్నాలైన వాజ్‌పేయీ, మదన్ మోహన్ మాలవీయలు దేశ అస్తిత్వాన్ని, ఐక్యతను, గౌరవాన్ని కాపాడారని, జాతి నిర్మాణంలో వారు చెరగని ముద్ర వేశారని కొనియాడారు. గురువారం వాజ్‌పేయీ, మాలవీయ, బిజిలీ పసీల జయంతి కావడంతో వారికి ప్రధాని నివాళులర్పించారు.

### జాతీయ నేతల ఘన చరిత్రను చెరిపేసే ప్రయత్నం

వారసత్వ రాజకీయాల కారణంగా అనేక మంది జాతీయ నేతల కృషి కనిపించకుండా పోయిందని, నేతాజీ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ అంబేడ్కర్‌ల ఘన వారసత్వాన్ని చెరిపేసే ప్రయత్నాలు జరిగాయని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలనుద్దేశించి వ్యాఖ్యానించారు. అభద్రతా భావంతో రాజకీయ అస్పృశ్యతను కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు పెంచి పోషించాయని, భాజపాను అంటరాని పార్టీగా చూశాయని పేర్కొన్నారు. ఎన్డీయే అన్ని పార్టీలను గౌరవించిందని, కాంగ్రెస్ నేతలైన పీవీ నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీలకు భారత రత్న ఇచ్చిందని, ములాయం సింగ్ యాదవ్, తరుణ్ గొగొయ్‌లను అత్యున్నత పురస్కారాలతో గౌరవించిందని తెలిపారు.

వాజ్‌పేయీ విగ్రహం వద్ద ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

మాజీ ప్రధాని వాజ్‌పేయీ 101వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ గురువారం దిల్లీలో నివాళులర్పించారు. వాజ్‌పేయీ స్మారక చిహ్నం 'సదైవ్ అటల్'వద్ద ఏర్పాటు చేసిన ప్రార్థనా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇంకా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### దిల్లీలో 'అటల్ క్యాంటీన్ల' ప్రారంభం



దేశ రాజధానిలోని 11 ఎకరాల పార్కుకు అటల్ బిహారీ వాజ్‌పేయీ సద్భావనా ఉద్యాన్‌గా పేరు పెట్టారు. దిల్లీలో రూ.5కు భోజనం అందించే అటల్ క్యాంటీన్లను ముఖ్యమంత్రి రేఖా గుప్తా గురువారం ప్రారంభించారు. 100 క్యాంటీన్ల ద్వారా రోజూ లక్ష మందికి భోజనం అందించనున్నట్లు ఆమె తెలిపారు.

### 65 అడుగుల ఎత్తు కాంస్య విగ్రహాలు

ప్రధాని మోదీ ప్రారంభించిన 'రాష్ట్రీయ ప్రేరణా స్థల్' కొంత కాలం కిందటి వరకూ వ్యర్థాల పారబోత ప్రాంతంగా ఉండేది. గోమతీ నదీ తీరంలో ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పుడు జాతీయ స్మారకం ఏర్పాటుతో పచ్చదనం వెల్లివిరుస్తోంది. దాదాపు 50వేల వృక్షాలను మియవాకీ పరిజ్ఞానం సాయంతో ఇక్కడ నాటారు. భాజపా ఆర్ఎస్ఎస్‌ల సిద్ధాంతకర్తలైన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయీల 65

# వెంకయ్యనాయుడితో నితిన్ నబీన్ మర్యాదపూర్వక భేటీ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 25)

భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ గురువారం ఇక్కడి 1-త్యాగరాజమార్గ్ నివాసంలో పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన వెంకయ్యతో భేటీ అయ్యారు. ఈ భేటీలో పలు అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడినట్లు వెంకయ్యనాయుడు 'ఎక్స్'లో పేర్కొన్నారు. "నితిన్ నబీన్‌తో సుదీర్ఘ సంభాషణ జరిగింది. నా సొంత అనుభవాలను, పూర్వ అధ్యక్షుడిగా పార్టీ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి సలహాలు, సూచనలను పంచుకున్నాను. దేశవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించాలని సూచించాను. ప్రజలు, పార్టీ శ్రేణుల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం కార్యకర్తలతో మమేకమై ఉండటం అత్యవసరం అని చెప్పాను" అని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# అక్రమ బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించారు. జిల్లాలో ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. ప్రజలు ఇటువంటి అక్రమ కార్యకలాపాల పై సమాచారం ఉంటే వెంటనే డయల్ 112, స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు.



# పిల్లలు బాగా చదువుకుని జీవితంలో పైకి రావాలి

# నైజీరియాలోని ఐసిస్ ఉగ్ర స్థావరాలపై అమెరికా మెరుపుదాడి!

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 25)



నైజీరియా వాయవ్య ప్రాంతంలోని ఐసిస్ ఉగ్రవాద స్థావరాలపై అమెరికా వైమానిక దాడి. అమాయక క్రైస్తవుల ఊచకోతలకు ఈ దాడి సమాధానమని ట్రంప్ ప్రకటన

కమాండ్ ఇన్ చీఫ్‌గా తన ఆదేశాల మేరకు దాడి జరిగిందన్న అధ్యక్షుడు

నైజీరియా వాయవ్య ప్రాంతంలోని ఐసిస్ ఉగ్రవాద స్థావరాలపై అమెరికా సైనిక దాడిని నిర్వహించింది. దేశంలో పౌరులపై పెరుగుతున్న దాడులకు ప్రత్యక్ష సమాధానంగానే ఈ చర్య తీసుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. "ఈ రాత్రి కమాండర్ ఇన్ చీఫ్‌గా నా ఆదేశాల మేరకు నైజీరియా వాయవ్య ప్రాంతంలోని ఐసిస్ ఉగ్రవాదులపై శక్తివంతమైన, అత్యంత విధ్వంసకర దాడిని అమెరికా ప్రారంభించింది" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఉగ్రవాద ముఠా ఏళ్ల తరబడి అమాయక క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని దారుణంగా హత్య చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.తాను ఈ దాడికి ముందే ఉగ్రవాదులకు హెచ్చరికలు జారీ చేసినట్లు ట్రంప్ తెలిపారు. "క్రైస్తవుల హత్యలు ఆపకపోతే నరకం చూపిస్తామని నేను ఈ టెర్రరిస్టులను ముందే హెచ్చరించాను, ఈ రాత్రి ఆ హెచ్చరిక కార్యరూపం దాల్చింది" అని ఆయన అన్నారు. ఈ మిషన్‌లో అమెరికా దళాలు పలు ఆపరేషన్లను నిర్వహించినట్లు వివరించారు. "యుద్ధ విభాగం అనేక పక్కా దాడులను నిర్వహించింది, ఇది అమెరికా మాత్రమే చేయగలిగిన పని" అని పేర్కొన్న ట్రంప్.. కార్యాచరణ వివరాలను మాత్రం వెల్లడించలేదు. "నా నాయకత్వంలో, మన దేశం రాడికల్ ఇస్లామిక్ టెర్రరిజం వృద్ధి చెందడానికి అనుమతించదు" అని ఆయన స్పష్టం చేశారు.

# సంథాలీ భాషలో రాజ్యాంగాన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 25)

దేశరాజధాని దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంథాలీ భాషలో భారత రాజ్యాంగాన్ని ఆవిష్కరించారు.

దేశంలో మనుగడలో ఉన్న అత్యంత ప్రాచీన భాషల్లో ఒకటైన సంథాలీని 2003లో 92వ రాజ్యాంగ సవరణ ద్వారా ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చారు. ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో గిరిజనులు ఈ భాషను మాట్లాడతారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. 'ఓల్ చికీ లిపిలో రాజ్యాంగం అందుబాటులోకి రావడం సంథాలీ ప్రజలకు గర్వకారణం. ఇది తమ మాతృభాషలో రాజ్యాంగాన్ని చదివి అర్థం చేసుకునే అవకాశం కల్పిస్తుంది' అని పేర్కొన్నారు. సంథాలీ భాషలో రాజ్యాంగాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేసిన కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ బృందాన్ని రాష్ట్రపతి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



# మనువాదాన్ని మట్టుబెట్టేందుకే మనుస్మృతికి దహనం

## అంబేద్కర్ రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

## దళిత హక్కుల నేత నీలం నాగేంద్రరావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 25)**

దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో 98 వ మనుస్మృతి దహన దినోత్సవాన్ని గురువారం ఒంగోలులో నిర్వహించారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయం వద్ద మనుస్మృతి దహన దినోత్సవం జరిగింది. ఈ సందరరేగా నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ భావజాలాన్ని దళితులు విస్మరించిన రోజు మనుస్మృతికి మళ్ళీ ప్రాణం వస్తుందన్నారు. 1927 డిసెంబర్ 25న మహారాష్ట్రలోని మహాద్‌లో దళితులు అంటరానితనం, కుల వివక్ష, స్త్రీల పట్ల వివక్షకు వ్యతిరేకంగా మనుస్మృతిని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బహిరంగంగా దహనం చేసిన చారిత్రక సంఘటన జరిగిందన్నారు. ఇది కుల వ్యవస్థను, దానిలోని అణచివేత సిద్ధాంతాలను తిరస్కరించడానికి, సమాజంలో సమానత్వం, గౌరవం కోసం జరిగిన ఒక శక్తివంతమైన నిరసన అన్నారు. ఈ సూర్తే కొనసాగింపులో భాగంగానే మనుస్మృతిని ఈ రోజుకీ దహనం చేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా మను స్మృతిని దళిత, బహుజనులు తగలబెడుతూనే ఉన్నా, మను స్మృతిని బతికించాలని మనువాద, అగ్రకుల శక్తులు ప్రయత్నిస్తూనే ఉన్నాయన్నారు. గత 90 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా మనువాద ప్రభుత్వాలు నేడు మనుస్మృతి ప్రతుల దహనాన్ని కూడా అడ్డుకున్నాయన్నారు. మనుస్మృతిని అంబేద్కర్ తగలబెట్టిన రోజునున్న పరిస్థితులే ఈరోజుకి ఉన్నాయన్నారు. అగ్రకుల మనువాద పార్టీలు అంబేద్కర్ రాజ్యాంగాన్ని తొలగించి, మనుస్మృతిని మళ్ళీ భారత రాజ్యాంగం తీసుకురావాలనే సంకల్పం తీసుకున్నాయన్నారు. ఆశ్చర్యం ఏమిటంటే అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కుతోనే, అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అగ్రకుల, మనువాద పార్టీలు మార్చాలని ప్రయత్నిస్తున్నాయన్నారు. అంబేద్కర్ ఇచ్చిన ఓటు విలువను దళిత బహుజనుల కంటే, ఈ దేశంలోని అగ్ర కులాలే ఎక్కువగా గుర్తించి, లబ్ధి పొందుతున్నాయన్నారు. భారతదేశంలో ప్రధాని మోడీ కైనా, కూలి పనులు చేసుకునే బోడియ్య కైనా ఒకటే ఓటు ఉందన్నారు. మనువాదులు దళిత, బహుజనుల్ని మతం మత్తులో ముంచి ఓట్లు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 70 శాతం గా ఉన్న దళిత బహుజనులు అగ్రకుల మనువాద రాజకీయ పార్టీలకు ఓటర్లుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఆశించినట్టుగా 400 ఎంపీ సీట్లతో అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారనే ఆందోళనతో ప్రజలు ఎన్డీఏ కూటమికి సంపూర? మెజార్టీ ఇవ్వలేదన్నారు. ప్రజల్లో వచ్చిన ఈ చైతన్యం, మనువాద పార్టీలను గద్దె దించేంతవరకు కొనసాగాలన్నారు. దళితులు ఏమరుపాటుగా ఉన్నా, అనైక్యతతో ఉన్నా మను స్మృతి మళ్ళీ వస్తుందన్నారు. మను స్మృతి మళ్ళీ రాకుండా, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం కోసం దళితులు మెలుకువగా, ఐక్యంగా అంబేద్కర్ భావజాలంతో ఉండాలన్నారు. 'మనుస్మృతి దహన్ దివస్' కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, కేవీపీఎస్ కార్యదర్శి రఘురాం, నీలం పాలెం అంబేద్కర్ సొసైటీ అధ్యక్షులు వేలూరి శ్రీనివాసరావు, అంక ప్రసాదు, దేవరపల్లి రమణయ్య, మోరపాకుల వెంకట కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



# బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువుల పై జరుగుతున్న దాడులను అరికట్టాలి

## మత ఉన్మాదులకు కులం, మతం, ప్రాంతం ఉండదు

## ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి చాంద్ భాష



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 25)**

బద్వేల్ పట్టణం ఆవాజ్ కార్యాలయం నందు ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి చాంద్ భాషా, బద్వేల్ పట్టణ ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్ అబ్దుల్ సత్తార్‌లు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించారు. ఆ దేశంలో మత ఉన్మాదులు అమాయక మైనార్టీ హిందువుల పై దాడులు చేస్తున్నారు. భలుకా జిల్లా, దుబాలియా పట్టణంలో దుస్తులు తయారు చేసే కర్మాగారంలో కార్మికుడిగా ఉన్న దీపు చంద్రదాస్ అనే యువకుడు మొహమ్మద్ ప్రవక్తను దూషించాడనే నేపంతో అల్లరి మూకలు దారుణంగా కొట్టి చెట్టుకు కట్టేసి నిప్పు పెట్టడం చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ దాడులకు ప్రధానమైన కారణం బంగ్లాదేశ్ విద్యార్థుల ఆందోళనలో కీలక పాత్ర పోషించిన ఇంకిలాబ్ మోంచ్ నాయకుడైన షరీఫ్ ఉస్మాన్ హాది పై గతవారం డాకా నగరంలో ముసుగు వేసుకుని దుండగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో ఉస్మాన్ హాదికి తలకు బలమైన గాయమైంది. అతనికి ఆసుపత్రి తరలించగా వైద్యులు అతనికి సింగపూర్‌లో తరలించి అక్కడ వైద్యం చేయిస్తుండగా ఉస్మాన్ హాది ఆసుపత్రిలో మరణించడం జరిగింది. అతని శవాన్ని బంగ్లాదేశ్ తీసుకురాగానే అల్లరి మూకలు దాడులు ప్రారంభించారు. ఈ దాడులలో అమాయక హిందూ సోదరులు గాయపడ్డారు. బంగ్లాదేశ్‌లో ప్రముఖ వార్త పత్రికలయిన ది డైలీ స్టార్, ప్రాథోమ్ ఆలో, కార్యాలయాలను అల్లరి మూకలు ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. మతోన్మాదులకు కులం, మతం, ప్రాంతం ఉండదు. ఇలాంటి దుర్మార్గపు దాడులను ఏ కులస్తుడు చేసిన, ఏ మతస్థుడు చేసిన ప్రపంచంలో ఎక్కడ జరిగినా మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. బంగ్లాదేశ్‌లో అమాయక హిందువుల పై ఇంత జరుగుతున్నా భారత ప్రధాని నరేంద్ర మోడీ దాడులను ఖండించకపోవడం చాలా దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోడీ బంగ్లాదేశ్ వెళ్లి బంగ్లా ప్రభుత్వ అధిపతి అయిన మొహమ్మద్ యూనస్‌తో చర్చలు జరిపి హిందువుల పైన దాడులు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు ఎస్ ఖాజా గౌస్, కేబీ రసూల్, ఎస్ దావూద్, ప్రభాస్, అబ్దుల్లా, నాగూర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇనిమెర్ల ఎస్సీ కాలనీకి ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద రూ.10 లక్షలు మంజూరు



**(షణ్ముఖ వెలుగు, పామూరు, డిసెంబర్ 25)**

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఇన్నిమెర్ల గ్రామానికి ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం మంజూరు చేయబడిందని నెల్లూరు కమిషనర్ ఎద్దుల ఓబులేసు, సిద్ధమూర్తి లక్ష్మి నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డికి, కనిగిరి ఎమ్మెల్యే, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి, నెల్లూరు కమిషనర్ ఎద్దుల ఓబులేసుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్ శంకర్‌రెడ్డి, దుగ్గిరెడ్డి బాలకృష్ణారెడ్డి, ఎద్దుల రామారావు, ఎద్దుల రామకృష్ణ, ఎర్రగుంట్ల శ్రీను, ఇనిమెర్ల గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల పార్లమెంటరీ ఉపాధ్యక్షుడిగా గొల్లపూడి సుబ్బారావు

### సాధారణ కార్యకర్త స్థాయి నుంచి పార్లమెంటరీ ఉపాధ్యక్షుడిగా సుబ్బారావు ప్రస్థానం



**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 25)**

తెలుగుదేశం పార్టీ నూతనంగా పార్లమెంటరీ కమిటీ సభ్యుల పేర్లను విడుదల చేసింది. అందులో భాగంగా బాపట్ల పార్లమెంటరీ ఉపాధ్యక్షుడిగా సంతనూతలపాడు నియోజకవర్గం చీమకుర్తికి చెందిన గొల్లపూడి సుబ్బారావును నియమించారు. గొల్లపూడి సుబ్బారావు కార్యకర్త స్థాయి నుండి నాయకుడిగా, మండల తెలుగు యువత అధ్యక్షునిగా, పట్టణ పార్టీ అధ్యక్షునిగా, సంతనూతలపాడు నియోజకవర్గ సలహాదారునిగా తనకు ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. గత 25 సంవత్సరాలుగా స్థానికంగా నిర్వహించే పార్టీ కార్యక్రమాలలో ఎంతో చురుగ్గా పాల్గొంటున్నందుకు, ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో చీమకుర్తి పట్టణ పార్టీ అధ్యక్షునిగా, 2024 సార్వత్రిక ఎన్నికలలో కూటమి విజయంలో భాగంగా సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోనీ చీమకుర్తి టౌన్, మండల మెజార్టీ సాధించడంలో తనదైన పాత్ర పోషించినందుకు గాను సుబ్బారావుకు తెలుగుదేశం పార్టీ సముచిత స్థానం కల్పించింది. ఈ అవకాశం కల్పించిన సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తేనేటి కృష్ణ ప్రసాద్, చీమకుర్తి పట్టణ, మండల పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, తెలుగుదేశం పార్టీ అభీమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## వాజ్‌పేయ్ ఆశయాలను కొనసాగించాలి



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిసెంబర్ 25)**

మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయ్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం ఉలవపాడు, ట్రంకురోడ్డు పాత బస్టాండ్ వద్ద వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఉన్న ప్రజలకు మిఠాయిలు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జి టి రాము, సీనియర్ నాయకులు పొందూరి కృష్ణారెడ్డి, ఆడేళ్ళ యలమందయ్య, సురేష్, సుధాకర్, లక్ష్మణ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలుపుతూ చీరలు పంపిణీ చేసిన జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు ఆకుపాటి





(షణ్ముఖ వెలుగు, పామూరు, డిసెంబర్ 25)

పామూరు పట్టణంలో స్థానిక అంకాలమ్మ వీధిలో ఉన్నటువంటి చర్చి వద్ద ప్రకాశం జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ప్రార్థన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఎస్ సభ్యులు ఇండ్ల నరసింహారావు, తాళ్లపల్లి వెంకటయ్య, పాస్టర్స్, ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా టీడీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా రాచకొండ మల్లికార్జున



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 25)

జిల్లా తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా మార్కాపురం పట్టణానికి చెందిన బిసి సామాజికవర్గ నాయకులు రాచకొండ మల్లికార్జున ను నియమిస్తూ తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. పదవి ఇచ్చిన సందర్భంగా రాచకొండ మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళలకు ఉచిత వైద్య శిబిరం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 25)

ప్రతి నెల నాల్గవ శుక్రవారం జరిగే ఉచిత మెడికల్ క్యాంపులో భాగంగా 26వ తేదీన శ్రావణి హాస్పిటల్ నందు గర్భిణీ స్త్రీలకు, మహిళలకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు శ్రావణి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మెడికల్ క్యాంపులో బుక్ చేసుకున్న గర్భిణీ స్త్రీలకు ఆపరేషన్, నార్మల్ డెలివరీకి అయ్యే ఖర్చులో రూ.30 శాతం తగ్గించడం జరుగుతుందని ఆమె తెలిపారు. కావున ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మనుధర్మశాస్త్ర ప్రతుల దహన కార్యక్రమం భగ్నం చేసిన పోలీసులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 25)

1927 డిసెంబర్ 25న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ లక్షల మంది సమక్షంలో మనుధర్మశాస్త్రాన్ని తగులబెట్టి ఆ వారసత్వాన్ని కొనసాగించమని పిలుపునిచ్చియున్నారు. కులనిర్మూలనా పోరాట సమితి గత 26 సంవత్సరాలుగా ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తు వుంది. అందులో భాగంగా గురువారం ఒంగోలు పట్టణంలో వివిధ ప్రజా సంఘాల సహకారంతో మనధర్మశాస్త్ర ప్రతులను దహనం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు కార్యక్రమాన్ని సమన్వయం చేయుచూ మనుస్మృతి ప్రతులను దహనం ప్రారంభించగానే పోలీసులు అడ్డుకున్నారు. మనుస్మృతి ప్రతులను మరియు అగ్గిపెట్టెను కూడా లాక్కున్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి చావలి సుధాకర్ క్లుప్తంగా వివరించి యితర ప్రజా సంఘాల నాయకులతో సందేశం ఇప్పించే అవకాశం లేకుండా పోలీసులు కార్యక్రమాన్ని భగ్నం చేసి అరెస్టును ప్రకటించారు. వన్ టౌన్, టు టౌన్ సిఐలు, యస్ఐలు ఇతర సిబ్బంది ప్రజా సంఘాల నాయకులను పోలీసు వాహనాలలో ఎక్కించబోగా నాయకులు నిరాకరించారు. తగులబెడదాం మనుధర్మశాస్త్రాన్ని రక్షించుకుందాం రాజ్యాంగాన్ని – వర్ధిల్లాలి కుల నిర్మూలన పోరాటాలు – దళిత బహుజనుల ఐక్యత వర్ధిలాల్లి లాల్ నీల్ మైత్రి మొదలైన నినాదాల మధ్య మీడియా వెంటరాగ పోలీసు పహరా మధ్య ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుండి కలెక్టరేట్, ట్రంకురోడ్డు, మిరియాలపాలెం మీదుగా ఫ్లెక్సీలతో ప్రదర్శన కొనసాగింది. కేఎన్‌పీఎస్ నాయకులు యం జార్జి, డి అంకయ్య, ఎ రాంబాబు, పి కొండలు, ఎంఆర్‌పీఎస్ నాయకులు తొరాటి ఆనంద్, ఏఊబీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పేరం సత్యం, జిల్లా అధ్యక్షులు అజీజ్, సీపీఐఎంఎల్ రెడ్ స్టార్ నాయకులు భీమవరపు సుబ్బారావు, ఐఎల్‌పీ రాష్ట్ర నాయకులు దాసరి సుందరరావు, విశ్రాంత డిప్యూటి కలెక్టర్ పేరయ్య తదితరులు అరెస్టుకు సిద్ధమైనప్పటికి పోలీసు వారు మాట్లాడి పంపారు.







# కోడి పందాల బరి పై ఆకస్మిక దాడి

(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, డిసెంబర్ 25)

మండలంలోని ఎంపీ చెరువు గ్రామం సమీపంలో కోడిపందాల బరిపై ఎస్ఐ రవీంద్రారెడ్డి సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో నాలుగు ద్విచక్ర వాహనాలు, ఆరు పందెపుకోళ్లు, 8 మంది పందెపు రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8100 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



# ఘనంగా బిజీ వేముల వీరారెడ్డి వర్ధంతి వేడుకలు

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 25)

దివంగత మాజీ మంత్రివర్యులు అపర చాణిక్యుడు బద్వేల్ పెద్దాయనగా నియోజవర్గ ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్న విజయ వేముల వీరారెడ్డి 25వ వర్ధంతి వేడుకలు గురువారం బద్వేల్‌లోని ఎస్బిఐ కాలేజ్ ప్రాంగణంలో వీరారెడ్డి ఘాట్ వద్ద వర్ధంతి వేడుకలను బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ గా మొదలైన రాజకీయ జీవితంలో మంత్రి స్థాయిలో రాష్ట్ర ప్రజలకు సేవలు అందించారు. రాజకీయంలో ఆయనకు ఉన్న పట్టుదల, ధైర్యం ఎనలేదన్నారు. నియోజవర్గ ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు సృష్టించి ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడంలో కీలక పాత్ర వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కడప జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ మంజూరు సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ రవికుమార్‌రెడ్డిలు కలిసి పాల్గొని నివాళులర్పించారు. కళాశాల ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంస్కృతి కార్యక్రమాలను ఘనంగా ఏర్పాటు చేశారు.







# భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ పర్వదినం ఆరాధన



(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 25)

పొదిలిలో క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక ది సెంటినరి తెలుగు బాప్టిస్ట్ చర్చి వారు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఆయా ప్రాంతాలనుండి అనేకమంది క్రైస్తవ సోదరసోదరిమనులు, సంఘస్థులందరు క్రిస్మస్ ప్రత్యేక ఆరాధనలో పాల్గొన్నారు. స్థానిక పాస్టర్ రెవ డాక్టర్ గొంగటి సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ ప్రార్ధనలో క్రీస్తు జననం గురించి బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవ తేళ్ల జాన్ విక్టర్ దైవ వర్తమానం అందించారు. ఆరాధనలో పాల్గొన్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా కమిటీ సభ్యులు చైర్మన్ పెరిక జ్ఞాన సుందరరావు, సెక్రటరీ గౌడిపేరు కిషోర్ కుమార్, ట్రెజరర్ మంగళ నవీన్, మార్క్ కళ్యాణ్, స్టాండింగ్ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. క్రైస్తవులందరు ఒకరినొకరు కరచాలనం చేసుకుంటూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.








# ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్‌కి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన పోతినేని శ్రీనివాసరావు, మండల నాయకులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 25)

మంగమూరు రోడ్‌లోని సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్‌ని కలిసి క్రిస్మస్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఎమ్మెల్యే చేత క్రిస్టమస్ కేక్ కట్ చేయించి పుష్పగుచ్చం అందజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మద్దిపాడు మండల అధ్యక్షులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, మండల సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, మల్లవరం వెంకటేశ్వరస్వామి, ఆలయ చైర్మన్ మార్నేని రాఘవ, తదితర మండల నాయకులు పాల్గొన్నారు.



# 2026 నూతన సంవత్సర వేడుకలు.. హైదరాబాద్‌లో డిసెంబర్ 31 వరకు తనిఖీలు

**హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు**

**మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిక**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 25)

2026 నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో డిసెంబర్ 31 వరకు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ తనిఖీలు చేపట్టనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహించిన తనిఖీలలో 304 మంది పట్టుబడ్డారు. ట్రాఫిక్ పోలీసులు వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈగల్ టీమ్ సిబ్బంది మేడిపల్లిలోని గంజాయి పెడ్లర్స్‌పై దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేసింది. మేడిపల్లి పోలీసులతో కలిసి ఈ దాడులు నిర్వహించారు. నిందితుల నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిని అక్రమ్, షఫీ, పృథ్వీరాజ్, రాహుల్‌గా గుర్తించారు. పృథ్వీరాజ్ కొవిడ్ తర్వాత ఉపాధి కోల్పోయి, ఆ తరువాత ఒడిశా నుంచి గంజాయి తెచ్చి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.




# రైతు పంట పండింది

**ఎకరాకు 130 టన్నుల చెరకు దిగుబడి**

**చెరకుగడతోబాళప్ప,వ్యవసాయశాస్త్రవేత్తలు,స్థానికయువత**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 25)

సాధారణంగా చెరకు ఒక ఎకరానికి 40 నుంచి 60 టన్నుల దిగుబడి వస్తుంది. కర్ణాటకలోని బెళగావి జిల్లా కల్లోళి గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు బాళప్ప బసప్ప బెళకోడ (72) ఎకరానికి ఏకంగా 130 టన్నులు దిగుబడి తీశారు. మూడెకరాల్లో పండిన మొత్తం 391 టన్నుల చెరకును మిల్లుకు తరలించి రూ.12,90,300 బిల్లును పొందారు. గతేడాది కూడా ఆయన ఎకరానికి 125 టన్నుల దిగుబడి సాధించారు. 'సీఓ 86032' రకం చెరకును నాటుకున్నారు. 'నాటే ముందు చాలా సార్లు మట్టి పరీక్షలు చేయించా. ఫలితాల ఆధారంగా భూమికి అవసరమైన పోషకాల కోసం సేంద్రియ, పరిమితంగా రసాయనిక ఎరువులను డ్రిప్‌తో తోటకు అందించా. ఎకరానికి రూ.65 వేల చొప్పున ఖర్చు వచ్చింది. చెరకు ఎదిగే వరకూ అంతర్ పంటగా మినుము, సెనగ, టమాటా, ఉల్లి పండించా. వాటి ఫలసాయం అందాక ఆ మొక్కలను తోటలోనే తొక్కి, ఎరువుగా మార్చా. జీవామృతం, సేంద్రియ ఎరువులు, వర్మీ కంపోస్టును స్వయంగా చేసుకుంటున్నా. సాగు విధానాలు తెలుసుకునేందుకు చైనా, ఇజ్రాయెల్, జపాన్‌లకు వెళ్లి వచ్చా. ఎకరానికి 200 టన్నుల దిగుబడి సాధించే దిశగా ఈ సారి ఐదెకరాల్లో చెరకు సాగు చేయాలనుకుంటున్నా' అని బాళప్ప వివరించారు.

# దక్షిణాదిలో నటించడం ఓ వరంలా భావిస్తా



ప్రేక్షకుల దృష్టిలో ఉండటం వృత్తిలో ఒక భాగం.. అది ఆ ఉద్యోగ స్వభావమని అంటోంది అందాల తార మృణాల్ ఠాకూర్. పాత్రల ఎంపికలో ప్రత్యేకత.. సహజమైన నటనతో అభిమానుల్ని మెప్పించే కథానాయికీమె. ఇటీవలే అజయ్ దేవగణ్‌తో కలిసి 'సన్ ఆఫ్ సర్దార్ 2' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది. ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా వరుస ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోన్న మృణాల్.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన సినీప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది.

**కేవలం భాషా వ్యత్యాసమే**

"ఈ మధ్య నేను దేని గురించి పెద్దగా ఆలోచించడం లేదు. నా వృత్తే నా లోకం. పనిపై మాత్రమే దృష్టి పెడుతున్నా. సినిమాలకు ఒకే చెప్తున్నా.. డబ్బింగ్ పూర్తి చేస్తున్నా. ఇదే నా ప్రపంచం. మరికొద్ది రోజుల్లో కొత్త ఏడాదికి స్వాగతం చెప్పబోతున్నాం. 2025 నాకు ప్రయోగాత్మక సంవత్సరం. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలోని 'డెకాయిట్', రొమాంటిక్ జానర్‌లో రూపొందిన 'హై జవానీ తో ఇష్క్ హోనా' లాంటి పలు వైవిధ్యమైన జానర్లను ప్రయత్నించాను. సినిమా సెట్స్‌లో ఉండడం నాకు బాధ్యతలా అనిపిస్తుంది. నువ్వు ఏ దశలో ఉన్నావని మీరు అడిగితే.. ఇప్పుడిప్పుడే ఒకొక్క అడుగు వేస్తూ ముందుకు వెళ్తున్నానని చెప్తా".

"కొన్నేళ్లుగా దక్షిణాదిలో, బాలీవుడ్‌లో మంచి అవకాశాలను అందుకుంటున్నా. ఈ రెండు ప్రపంచాల మధ్య ఉత్తమమైన వాటిని ఆస్వాదిస్తాను.. తప్పా సరిహద్దుల గురించి పట్టించుకో. కేవలం ఇదొక భాషా వ్యత్యాసం మాత్రమే. చిత్రీకరణ కొంచెం భిన్నంగా ఉంది. రెండు పరిశ్రమల్లో షూటింగ్ చేయగలగడం.. ఎక్కువ మంది ప్రేక్షకులకు మంచి చిత్రాల్ని అందించడం నాకు సంతోషంగా ఉంది. తెలుగు ప్రేక్షకులు నాపై చూపించే ప్రేమాభిమానాలకు నేను ఎప్పుడూ రుణపడి ఉంటాను. అయితే దక్షిణాది చిత్రాల్లో నటించడమనేది నా ప్రణాళికలో లేదు. కనీసం ఎప్పుడూ అనుకోని విషయం ఇది. కానీ ఈ అవకాశాన్ని ఒక వరంలా భావిస్తాను".

**ఇతరుల కోసం పోస్ట్ చేయను**

"సాధారణంగా నటీనటులందరూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, ఫొటోలు పెట్టడానికి ప్రత్యేక టీమ్‌ను పెట్టుకుంటారు. నేను అలా కాదు. అలాగే ఎప్పుడు కూడా నా ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను పోస్టులతో ప్రజాదరణ పొందడానికి, లైక్‌లు, ఫాలోయింగ్ పెంచుకోవడానికి ఒక సాధనంగా పరిగణించలేదు. ఇతరుల కోసం పోస్ట్ చేయను. నా కోసం నేను పోస్ట్ చేస్తాను. ప్రేక్షకులకు దగ్గరగా ఉండే మార్గాల్లో ఇదీ ఒకటి. ఇది నాకు ఒక జ్ఞాపకాల మ్యూజియం లాంటిది. నా ప్రొఫైల్‌ను చూసే అభిమానులు నన్ను నిజమైన వ్యక్తిగా చూడాలని కోరుకుంటున్నా. ఇతరులు ఏమనుకుంటున్నారో పట్టించుకోకుండా.. మన పనిని కొనసాగించాలనే సూత్రాన్ని అనుసరిస్తాను".

# కొత్త ఏడాదిలో ప్రేమ ముచ్చట్లు



వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటుంది అందాల తార అలియా భట్. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'లవ్ అండ్ వార్' సినిమా ఉన్న సంగతి తెలిసిందే. ఆమె, రణ్‌బీర్ కపూర్ జంటగా నటిస్తున్న చిత్రమిది. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహిస్తున్నారు. విక్కీ కౌశల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను జనవరిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. "కొత్త సంవత్సరం సందర్భంగా ప్రేక్షకులకు అలియా ప్రేమ ప్రపంచాన్ని పరిచయం చేయాలనే ఆలోచనలో ఉంది చిత్రబృందం. త్వరలో చివరి షెడ్యూల్ చిత్రీకరణ ప్రారంభం కానుంద"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. రొమాంటిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది థియేటర్లలోకి రానుంది.



# భర్త మహాశయులారా..

రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల తెరకెక్కించిన చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 13న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ చిత్రం నుంచి కొత్త లుక్‌ను విడుదల చేశారు. అందులో రవితేజ శాంటా క్యాప్ ధరించి చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. ఇది వినోదం నిండిన కుటుంబ కథా చిత్రంగా ముస్తాబైంది. ఈ సినిమాకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: ప్రసాద్ మూరెళ్ల.

# 'ఛాంపియన్' - మూవీ రివ్యూ!

'ఛాంపియన్' .. రోషన్ – అనశ్వర రాజన్ జంటగా నటించిన సినిమా. 'పెళ్లి సందడి' హిట్ తరువాత రోషన్ చేసిన సినిమా కావడంతో, ఈ ప్రాజెక్టుపై యూత్ లో ఆసక్తి ఏర్పడింది. ఇక మలయాళంలో స్టార్ హీరోయిన్ గా కొనసాగుతున్న అనశ్వర రాజన్ ఈ ప్రాజెక్టులోకి వచ్చిన దగ్గర నుంచి మరింత హైప్ వచ్చింది. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లకు వచ్చింది.కథ: దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేయడానికి ఖాసీం రజ్వి ఒప్పుకోడు. హింస ద్వారా తాను అనుకున్నది సాధించడం కోసం, నిజామ్ నిరంకుశ ప్రభుత్వం రజాకార్లను రంగంలోకి దింపుతుంది. రజాకార్ల ఆగడాలకు అనేక గ్రామాలు భయంతో వణికిపోతూ ఉంటాయి. అయితే 'బైరాన్ పల్లి' వంటి కొన్ని గ్రామాలకు చెందిన ప్రజలు మాత్రం ధైర్యంగా పోరాడుతూ ఉంటారు. అలాంటి పరిస్థితులలోనే తన స్నేహితుడు షబ్బీర్ తో కలిసి మైఖేల్ సి.విలియమ్స్ (రోషన్) ఆ గ్రామానికి వస్తాడు.

మైఖేల్ మంచి 'ఫుట్ బాల్' ప్లేయర్. తన ప్రతిభ కారణంగా ఇంగ్లండ్ మాంచెస్టర్ ఫుట్ బాల్ క్లబ్ లో ఆడే అవకాశాన్ని సంపాదించుకుంటాడు. అయితే అక్కడికి వెళ్లే అవకాశాన్ని సంపాదించుకోవడం కోసం అతను అక్రమంగా ఆయుధాలను రవాణా చేయవలసి వస్తుంది. ఆ క్రమంలో అతను పట్వారి రంగారావు (హర్షవర్ధన్) మనుషులకు పట్టుబడబోయి తప్పించుకుంటాడు. ఆ 'గడీ'లో బందీగా ఉన్న 'బైరాన్ పల్లి' యువకుడు భిక్షపతి విడుదలకు



కారకుడు అవుతాడు. అతని సూచన మేరకే ఆ గ్రామానికి వెళతాడు.

బైరాన్ పల్లికి పెద్దగా రాజారెడ్డి (కల్యాణ్ చక్రవర్తి) ఉంటాడు. ఆయన మాటపైనే ఆ గ్రామస్తులు నడుస్తూ ఉంటారు. రజాకార్లు ఆ ఊరును టార్గెట్ చేశారనే విషయం మైఖేల్ కి అర్థమవుతుంది. యుద్ధం అంటే ఎంతమాత్రం ఇష్టం ఉండని అతను, సాధ్యమైనంత త్వరగా అక్కడ నుంచి బయటపడాలని అనుకుంటాడు. అయితే తన కోసం వెదుకుతున్న పోలీసుల కంట పడకుండా కొన్ని రోజుల పాటు ఆ గ్రామంలోనే తలదాచుకోవడం మంచిదనే నిర్ణయానికి వస్తాడు.

నాటకాలు ఆడుతూ తన తండ్రితో కలిసి అదే గ్రామంలో చంద్రకళ (అనశ్వర రాజన్) నివసిస్తూ ఉంటుంది. చంద్రకళతో మైఖేల్ పరిచయం ప్రేమగా మారుతుంది. అలాంటి పరిస్థితులలోనే ఆ గ్రామంపై రజాకార్లు విరుచుకు పడతారు. యుద్ధం అంటే ఇష్టం లేని మైఖేల్ ఏం చేస్తాడు? అసలు అతనికి యుద్ధం పట్ల విరక్తి కలగడానికి కారణం ఏమిటి? తన ఆశయం కోసం ప్రేమను వదిలేస్తాడా? ప్రేమ కోసం తన మనసు మార్చుకుంటాడా? అనేది మిగతా కథ.

**విశ్లేషణ:** చాలా గ్యాప్ తరువాత రోషన్ చేసిన సినిమా. మలయాళంలో మంచి పేరున్న అనశ్వర రాజన్ తెలుగులో చేసిన తొలి సినిమా. రజాకార్ల కాలంలో నడిచిన ఒక ప్రేమ కథ ఇది. ఈ మూడు ప్రధానమైన అంశాలే ఈ సినిమా పట్ల ఆసక్తిని పెంచుతూ వెళ్లాయి. విలేజ్ నేపథ్యంలో .. రజాకార్ల కాలంలో నడిచే ప్రేమకథగా ప్రేక్షకులు ఈ సినిమాను గురించిన ఒక అంచనాకు వచ్చే అవకాశం ఎక్కువ. అలాంటివారికి కాస్త నిరాశను కలిగించే కథనే ఇది.

యుద్ధం అంటే ఇష్టం లేని హీరో యుద్ధం చేయవలసిన స్థానంలో నిలబడతాడు. తన ఆశయాన్ని నెరవేర్చుకోవాలంటే తాను ప్రేమించిన అమ్మాయినీ .. ఆపదలో తనకి ఆశ్రయమిచ్చిన ఊరును వదిలేసి వెళ్లిపోవాలి. రజాకార్ల కారణంగా ప్రమాదం పొంచి ఉన్న ఆ ఊరును అలా వదిలేసి అతను వెళ్లిపోతాడా? తాను ప్రేమించిన అమ్మాయి కోసం నిలబడి పోరాడతాడా? అనే కుతూహలాన్ని రేకెత్తించేలా దర్శకుడు ఈ కథను తయారు చేసుకున్న తీరు బాగుంది. కానీ ఆ స్థాయి ఆవిష్కరణ జరగలేదేమోనని అనిపిస్తుంది.

హీరో ఇంట్రడక్షన్ .. ఆ

**రోషన్ హీరోగా వచ్చిన 'ఛాంపియన్'**
**తెలుగు తెరకి అనశ్వర రాజన్ పరిచయం**
**రజాకార్ల కథకి పెరిగిన నిడివి**
**పాళ్లు తగ్గిన ప్రేమకథ**
**అక్కడక్కడా కనెక్ట్ అయ్యే ఎమోషన్స్**

తరువాత వెంటవెంటనే పడే సీన్స్ అంత పట్టుగా లేకపోవడం కాస్త అసహనాన్ని కలిగిస్తుంది. హీరోయిన్ ను హీరో కలుసుకునే సందర్భం తెరపైకి రావడానికి చాలా సమయం పట్టడం .. ఈ మధ్యలోని సన్నివేశాలు కూడా అంత ఎఫెక్టివ్ గా లేకపోవడం ఇబ్బంది పెడుతుంది. అసలు అంశం దగ్గరికి ఆడియన్స్ ను తీసుకుని వెళ్లడానికి గాను చాలా నిడివిని పణంగా పెట్టడం నిరాశను కలిగిస్తుంది.

**పనితీరు: తెలంగాణ నేపథ్యం ..** రజాకార్ల కాలం .. ఆ రోజుల్లో జరిగిన బలిదానాలకు సంబంధించిన కథలు గతంలో వచ్చాయి. ఆ నేపథ్యంలో సాగే ఒక అందమైన ప్రేమకథను చూడొచ్చనే ప్రేక్షకులు అనుకుంటారు. కానీ ఆ ప్రేమకథకు తక్కువ సమయాన్ని కేటాయించడం పేక్షకులకు అసంతృప్తిని కలిగిస్తుందని చెప్పచ్చు.

రోషన్ .. అనశ్వర రాజన్ తమ పాత్రలకు న్యాయం చేశారు. కల్యాణ్ చక్రవర్తి – అర్చన పాత్రలు నేపథ్యానికి బలాన్ని పెంచాయి. నిర్మాణ పరమైన విలువలు బాగున్నాయి. మిక్కి జే మేయర్ నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుంది. ఆయన స్వరపరిచిన బాణీలలో 'గిర గిరా .. ' .. 'సల్లంగుండాలే .. ' పాటలు మనసుకు పట్టుకుంటాయి. మధి ఫొటోగ్రఫీ .. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ బాగున్నాయి.

**ముగింపు: తెలంగాణ నేపథ్యం ..** రజాకార్ల కాలంలో ఫుట్ బాల్ ఆట అనేది ఒక ఇమడని అంశంగా అనిపిస్తుంది. అలాగే ఆ కాలంలో నడిచే ఈ కథకి 'ఛాంపియన్' అనే టైటిల్ కూడా సెట్ కాలేదేమో అనే భావన కలుగుతుంది. రజాకార్ల నేపథ్యంతో పాటు ప్రేమకథను కూడా అంతే బలంగా చూపించి ఉంటే ఈ కంటెంట్ మరింత బలంగా కనెక్ట్ అయ్యుండేదేమో అనే ఆలోచన రాకుండా ఉండదు.

# 'నాకు ఎమోషనల్ డే'.. తనయుడి సక్సెస్‌పై సాయికుమార్



తన కుమారుడు, నటుడు ఆది విజయంపై హర్షం వ్యక్తం చేశారు సాయి కుమార్ . ఆది నటించిన 'శంబాల' సక్సెస్‌కు ఎమోషనల్ అయినట్లు పేర్కొన్నారు. ఈ సినిమా గురువారం విడుదలైన సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు.

"ఇది నాకు ఎమోషనల్ డే. ఆది తొలి సినిమా 'ప్రేమ కావాలి' ఫస్ట్ డే ఫస్ట్ షో విజయనగరంలో చూశాక పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నా. ఇప్పుడు 'శంబాల'కూ హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి. నేను ఈ మూవీ లోగో ఉన్న టీషర్టు వేసుకుని, చిన్న పిల్లాడిలా హైదరాబాద్‌లోని పలు థియేటర్లకు వెళ్లా. అక్కడ తెలిసిన వారంతా 'సర్.. అబ్బాయి విజయం సాధించాడు' అంటుంటే ఎంతో ఆనందపడ్డా. ఓ థియేటర్ వద్ద ఎమోషనల్ అయ్యా. ఆది సక్సెస్ కోసం అందరం ఎదురుచూశాం. మధ్యలో కొన్ని మంచి సినిమాల్లో నటించినా ఆశించిన స్థాయిలో ఫలితం దక్కలేదు. విడుదలైన అన్ని ప్రాంతాల్లోనూ 'శంబాల' విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. విషెస్ మెసేజ్‌లు మాకు ఇంకా వస్తూనే ఉన్నాయి. కొందరు తమదైన శైలిలో రివ్యూలు పంపిస్తున్నారు. ఇందులోని పలు అంశాల గురించి చర్చించుకుంటున్నారు" అని సాయికుమార్ పేర్కొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com